సాక్షి
సంగారెడ్డి
మంగళవారం । 16 । మే । 2023



చెట్టుకొకరు.. పుట్టకొకరు

గౌరవెల్లి ప్రాజెక్టు కింద ముంపునకు గురైన గుడాటిపల్లితో పాటు పలు తండాలు కనుమరుగయ్యాయి. ప్రజలు చెట్టు కొకరు.. పుట్టకొకరుగా విడిపోయారు. 8లో



'ఉగ్ర సీన్' రీ-కన్‌స్ట్రక్షన్

భోపాల్‌లో చిక్కిన ఉగ్రవాదిని మధ్యప్రదేశ్ ఏటీఎస్ అధికారులు సోమవారం హైదరాబాద్‌కు తీసుకువచ్చి సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ చేశారు. 8లో

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 16 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 10 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు పేర్కొన్నాడు.

న్యూస్‌రీల్

సేకరించిన ధాన్యం త్వరగా తరలించాలి



కానుకుంటలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న జయశ్రీరాజ్

జిన్నారం(పటాన్‌చెరు): కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని ఐకేపీ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ జయశ్రీరాజ్ నిర్వాహకులకు సూచించారు. గుమ్మడిదల మండలం కానుకుంట, కొత్తపల్లి గ్రామాల్లో సోమవారం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం సేకరణపై అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులతో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, సేకరించిన ధాన్యం త్వరగా మిల్లులకు తరలించాలని సూచించారు. గోనె సంచుల సమస్య ఉంటే తక్షణం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు శివకుమార్, మెహరున్నీసా, కృష్ణ పాల్గొన్నారు.

రేపు పాలిసెట్

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు ఈనెల 17న నిర్వహించే పాలిసెట్ పరీక్షకు జిల్లాలో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా సమన్వయ కర్త శ్రీనివాసులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,760 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు హాల్ టికెట్, పరీక్ష సామగ్రితో 9.30గంటలకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరని, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని బెస్ట్ అవైలెబుల్ పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి 3, 5, 8తరగతుల్లో ప్రవేశాలకు అర్హులైన గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన అభివృద్ధి శాఖ అధికారి ఫిరంగి తెలిపారు. పట్టణంలోని సెయింట్ జోసెఫ్ హై స్కూల్‌లో 3వ తరగతిలో 23 సీట్లు, 5వ తరగతిలో 11 సీట్లు, 8వ తరగతిలో 11 సీట్లు ఖాళీలున్నాయన్నారు. దరఖాస్తు ఫారాలు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ కాంప్లెక్స్‌లో అందుబాటులో ఉన్నాయని, సంబంధిత ధ్రువపత్రాలతో జూన్ 2తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 7న డీటీడీఓ కార్యాలయంలో లాటరీ పద్ధతిన డ్రా తీస్తారని, ఎంపికైన విద్యార్థులకు జూన్ 15, 19 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించబడుతుందని అన్నారు.

నేడు జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్: జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన తెలిపారు. ఫినో పేమెంట్స్ బ్యాంక్ కంపెనీలో మూడు ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్లతో పాత వెలుగు ఆఫీస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు హాజరుకావాలన్నారు.

జూన్ 4న చలో హైదరాబాద్

సంగారెడ్డి టౌన్: ఓబీసీ సాధనకై జూన్ 4న హైదరాబాదులో నిర్వహించే జరిగే లింగాయత్ బహిరంగ సభను జయప్రదం చేయాలని వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ కోరారు. సోమవారం సంగారెడ్డి మండలంలోని చింతలపల్లి, కల్పగూర్ గ్రామాల్లో సభకు సంబంధించిన గోడపత్రిక, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధనుంజయ్, గౌరప్ప, గొల్లేశ్వర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

సంగారెడ్డి టౌన్: మిషన్ శక్తి స్కీం ద్వారా మహిళా సాధికారత కొరకు డిస్ట్రిక్ట్ హబ్ (డీహెచ్ఈడబ్ల్యు) కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ అభ్యంతరాలను ఈనెల 18లోపు సమర్పించాలని జిల్లా సంక్షేమ, మహిళా శిశు వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి పద్మావతి తెలిపారు. అర్హులు, అనర్హుల పేర్లతో కూడిన లిస్ట్‌ను జిల్లా సంక్షేమ అధికారి, మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఉంచామని, అభ్యర్థులు పరిశీలించుకోవాలని సూచించారు.

డీఈఓను కలిసిన ట్రస్మా నేతలు

జహీరాబాద్: జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లును సోమవారం ట్రస్మా జిల్లా అధ్యక్షుడు దశరథరెడ్డి ఆధ్వర్యంలో ట్రస్మా నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, సునీల్ కుమార్, ఏసురత్నం, జకీర్ పాల్గొన్నారు.

అంచనాలు కొండంత.. అనుమతి అంతంతే

జిల్లాలో జొన్న దిగుబడి అంచనా 53వేల మెట్రిక్ టన్నులు

- అనుమతిచ్చింది 7,658 మెట్రిక్ టన్నులే
- ఇంకా ప్రారంభం కాని సేకరణ

జిల్లాలో ఈ యాసంగి సీజనులో 29,764 ఎకరాల్లో జొన్న పంట సాగైందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. 53,565 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని ఆశాఖ లెక్క గట్టింది. అయితే ఈ జొన్న కొనుగోళ్లకు ప్రభుత్వం నుంచి వచ్చిన అనుమతి కేవలం 7,658 మెట్రిక్ టన్నులు మాత్రమే.

– సాక్షిప్రతినిధి, సంగారెడ్డి



బొక్కస్‌గాంలో జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన దృశ్యం (ఫైల్)

రాష్ట్రంలో జొన్న రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జొన్నను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ పంటకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,970లు ఉంది. కానీ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.2వేల నుంచి రూ.2,400 వరకు ధర పలుకుతోంది. ఈ ధరకు విక్రయిస్తే రైతులు తీవ్రంగా నష్టం పోయే పరిస్థితి ఉంది. దీంతో ఎప్పుడెప్పుడు కొనుగోళ్లు ప్రారంభమవుతాయోనని రైతులు ఎదురు చూస్తున్నారు. కాగా గత ఏడాది యాసంగిలో ప్రభుత్వం ఆరు వేల మెట్రిక్ టన్నుల జొన్నను కొనుగోలు చేసింది.

ఎనిమిది కొనుగోలు కేంద్రాలు..

జొన్న కొనుగోళ్లకు సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జిల్లా అధికార యంత్రాంగం ఎనిమిది కొనుగోలు కేంద్రాలను తెరవాలని నిర్ణయించింది. ఇప్పేపల్లి, బొక్కస్‌గాం, సదాశివపేట్, కృష్ణాపూర్, ఏడాకులపల్లి, ఝరాసంగం సహకార సంఘాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే వరాములో ఎంఏసీఎస్, నిజాంపేట్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతానికి కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఇప్పటికే జిల్లాలో పలు మండలాల్లో జొన్న విక్రయాలు కొనసాగుతున్నందున కొనుగోలు కేంద్రాల్లో సేకరణ ప్రక్రియను చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన మేరకు వెంటనే కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ఇటీవల నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

ఖేడ్‌లో అధిక సాగు

జిల్లాలో జొన్న అత్యధికంగా నారాయణఖేడ్ డివిజన్‌లో సాగవుతుంది. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం కల్హేర్ మండలంలో 4,761 ఎకరాల్లో పంటను సాగుచేశారు. కంగ్టిలో 4,016 ఎకరాలు, నారాయణఖేడ్‌లో 3269 ఎకరాలు, సిర్గాపూర్‌లో 3,160 ఎకరాలు, నాగల్‌గిద్దలో 10,94 ఎకరాలు, మనూరులో 1,587 ఎకరాలు, మునిపల్లిలో 1,278 ఎకరాలు, వట్‌పల్లిలో 1,984 ఎకరాలు, రాయ్‌కోడ్‌లో 1,028 ఎకరాలు, కొండాపూర్‌లో 1,750 ఎకరాలు, సదాశివపేట్‌లో 1,395 ఎకరాల్లో జొన్న పంట సాగైంది. ఈ మేరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి జొన్నను సేకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జన్ ఆరోగ్య సమితిలు ఏర్పాటు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శరత్

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని అన్ని సబ్ హెల్త్ సెంటర్లు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో జన్ ఆరోగ్య సమితిలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ, గ్రామీణ అభివృద్ధి, మిషన్ భగీరథ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 173 సబ్ సెంటర్లు, 26 పీహెచ్సీలు, 4 యూపీహెచ్‌సీలలో జన్ ఆరోగ్య సమితిలపై దృష్టి సారించాలని ఆదేశించారు. జన్ ఆరోగ్య సమితి పాత్ర, బాధ్యతలకు సంబంధించి ఆయా ఆరోగ్య కేంద్రాల్లో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని, ప్రతీనెల మూడో శనివారం సమావేశం నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి, డీఆర్డీఓ శ్రీనివాసరావు, మిషన్ భగీరథ ఈఈ పాష, వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి, డాక్టర్ సంగారెడ్డి, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ శశాంక్, డిప్యూటీ డీఎమ్ అండ్ హెచ్ ఓ, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యం



పోటీలను ప్రారంభిస్తున్న సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. సోమవారం హత్నూర మండలం దౌల్తాబాద్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సీఎం కప్ పోటీలను ఎమ్మెల్యే మదన్ రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతీ గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. క్రీడాకారులు ప్రతిభ చూపి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. క్రీడా పోటీలను స్నేహపూర్వకంగా నిర్వహించాలని సూచించారు. మూడు రోజులపాటు జరిగే పోటీల్లో క్రీడాకారులకు భోజనం అందించేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఎమ్మెల్యే మదన్ రెడ్డి కోరారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు హత్నూర సర్పంచ్ వీరస్వామి గౌడ్ మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ స్వప్న, ఎంపీపీ అధ్యక్షుడు నర్సింలు, జెడ్పీటీసీ అంజనేయులు, సర్పంచ్ వెంకటేశం, వీరస్వామి గౌడ్, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, మెదక్ జిల్లా కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, ఎంపీడీఓ శారదా దేవి, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ శరత్

- కలెక్టర్ డాక్టర్ శరత్
- ప్రజావాణికి 42 దరఖాస్తులు

సంగారెడ్డి టౌన్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల సత్వర పరిష్కారంపై ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఆయా శాఖల అధికారులు అర్జీలపై జాప్యం చేయకుండా విజ్ఞప్తులను పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పింఛన్లు, రుణం మంజూరు, ఉద్యోగ కల్పన, ధరణి తదితర సమస్యలపై మొత్తం 42 దరఖాస్తులు వచ్చాయని, 12 రెవెన్యూ శాఖ, 30 ఇతర శాఖలకు సంబంధించినవని ఆయన తెలిపారు. అనంతరం హత్నూర మండలం తుర్కల ఖానాపూర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు పోచయ్యకు ఇంటి స్థలం పట్టా సర్టిఫికెట్‌ను కలెక్టర్ అందజేశారు. రుద్రారంకు చెందిన పోచయ్య దివ్యాంగ కుమారుడు సాయి ప్రసాద్, కూతురు చైతన్యకు సదరం సర్టిఫికెట్లు అందజేశారు.

- రేషన్ డీలర్ల గౌరవ వేతనం పెంచాలని సంగారెడ్డి రేషన్ డీలర్ జిల్లా అధ్యక్షుడు నాయకోటి రాజ్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో దరఖాస్తు అందించారు.జూన్ 5లోపు సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెళతామని తెలిపారు.
- అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వరి, జొన్న, పత్తి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, సర్వే చేసి పరిహారం అందేలా చూడాలని కోరారు.
- టేక్మాల్ మండలం దన్నారం గ్రామానికి చెందిన బసవరాజ్ తన భూమిని ప్రభుత్వ అధికారులు కబ్జా చేస్తున్నారని, న్యాయం చేయాలని ఫిర్యాదు అందించారు.

పొజిషన్ చూపించాలి

కొండాపూర్(సంగారెడ్డి): గతంలో సదాశివపేట మండలం ఆత్మకూరులో పేదలకు ఇచ్చిన ఇండ్ల పట్టాలకు పొజిషన్ చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. సోమవారం అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో ఇండ్లు, స్థలాలు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి పట్టాలిచ్చిన వారందరికీ పొజిషన్ చూపించేలా చూడాలని కోరారు. ఆయనతో నాయకులు అశోక్, రాజయ్య, మహేష్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డికి ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫ్లెక్సీలు, కరపత్రాలు, మైకులతో ఇంటింటా ప్రచారం చేస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, వీటిపై విచారణ జరిగి చర్య తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్, పుండ్లిక్, సంతోష్ రెడ్డి తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కర్ణాటక తీర్పు బీజేపీ పతనానికి తొలిమెట్టు

సీపీఐ రాష్ట్ర నాయకుడు ప్రకాశ్‌రావు



మాట్లాడుతున్న ప్రకాశ్‌రావు

కొండాపూర్(సంగారెడ్డి): కర్ణాటక ఎన్నికల తీర్పు బీజేపీ పతనానికి తొలిమెట్టు అని సీపీఐ రాష్ట్ర నాయకుడు ప్రకాశ్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి 14 మంది ప్రధాన మంత్రులు రూ.56లక్షల కోట్లు అప్పు చేస్తే కేవలం మోడీ ఒక్కడే రూ.114లక్షల కోట్లు అప్పుచేశాడని ఆరోపించారు. దేశానికి వెన్నెముక లాంటి రైతులకు కాకుండా అదానీ, అంబానీలకు రూ.12.5లక్షల కోట్లను మాఫీ చేశారని మండిపడ్డారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధర తగ్గినా దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఎందుకు నియంత్రించడం లేదని ప్రశ్నించారు. సీపీఐ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో చేపట్టిన ఇంటింటికి సీపీఐ కార్యక్రమానికి ప్రజలు హారతి పడుతున్నారని, రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్, నాయకులు తాజుద్దీన్, మహబూబ్ ఖాన్, నరేందర్ రెడ్డి, శంకరప్ప, సునీత, రెహమాన్, రూబీనబేగం, అనురాధ, వజీర్ బేగ్, నర్సింలు, వినోద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన ఏదీ?



ఉదయం 10.35 గంటలకు టీ-హబ్ తెరుస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: ప్రజలకు మెరుగైన వైద్యంతో పాటు పరీక్షలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డయాగ్నోస్టిక్స్‌లో అధికారులు సమయపాలన పాటించడంలేదు. ఉదయం 9 గంటలకు ప్రారంభించాల్సిన కేంద్రాలు ఆలస్యంగా తీస్తుండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌ను సిబ్బంది సోమవారం 10.30 గంటలకు తీశారు. దీంతో పరీక్షల నిమిత్తం అక్కడకు వచ్చిన రోగులు దాదాపు రెండు గంటల పాటు ఎదురుచూశారు. ఆలస్యం కావడంతో మరికొంతమంది ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లారు. తీరా పరీక్షలు చేయించుకొని రిపోర్ట్ తీసుకొని వెళ్లేలోగా వైద్యులు వెళ్లిపోతున్నారని కేంద్రానికి వచ్చిన రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిటీ స్కాన్ టెక్నీషియన్ లేకపోవడంతో సంగారెడ్డికి రెఫర్ చేస్తున్నారని, సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది సమయపాలన పాటించి, అన్ని పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. దీనిపై జిల్లా అధికారులను సంప్రదిస్తే ఫోన్ లిఫ్ట్ చేయలేదు.



పరీక్షల కోసం కేంద్రం బయట ఎదురు చూస్తున్న రోగులు

వడివడిగా నిమ్జ్ రహదారి



నిమ్జ్‌కు కేటాయించిన ప్రాంతం

- తొమ్మిది కిలోమీటర్ల మేర నిర్మాణం
- వంద కోట్లతో కొనసాగుతున్న పనులు
- 65వ జాతీయ రహదారికి అనుసంధానం

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో ఏర్పాటవుతున్న జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి(నిమ్జ్) రహదారి నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. మండలంలోని హుగ్గెల్లి గ్రామ శివారు జాతీయ రహదారి నుంచి ఝరాసంగం మండలం బర్దిపూర్ శివారు వరకు దీనిని ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 12,635 ఎకరాల్లో ఏర్పాటు కానున్న నిమ్జ్‌కు వెళ్లేందుకు నిర్మిస్తున్న ఈ రోడ్డుతో చుట్టుపక్కల భూములకు మరింత విలువ పెరిగే అవకాశముంది.



జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

ఊపందుకున్న పనులు

- నిమ్జ్ పరిశ్రమ స్థాపనలో భాగంగా రహదారి నిర్మాణానికి 65.14గుంటల భూమిని అధికారులు సేకరించారు.
- జహీరాబాద్ 65వ జాతీయ రహదారి నుంచి ఝరాసంగం మండల పరిధిలోని నిమ్జ్ ప్రాంతం బర్దిపూర్ వరకు ఈ రోడ్డు నిర్మాణం జరగనుంది.
- సుమారు రూ.100 కోట్లతో చేపట్టిన పనుల్లో భాగంగా ప్రస్తుతం నేల చదును, చెట్ల తొలగింపు పనులు జరుగుతున్నాయి. హద్దులు ఏర్పాటు చేసి, యంత్రాలతో నేలను శుభ్రం చేస్తున్నారు.
- మొత్తం 9 కిలోమీటర్ల మేర 100 అడుగుల వెడల్పుతో ఈ రహదారిని నిర్మించనున్నారు.
- రోడ్డు నిర్మాణం పూర్తయితే నిమ్జ్ ప్రాంతానికి వచ్చే వారితో పాటు పరిసర గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది.
- ప్రస్తుతం నిమ్జ్ ప్రాంతానికి చేరుకునేందుకు జహీరాబాద్ 65వ జాతీయ రహదారి నుంచి పస్తాపూర్, మాచనూర్, బర్దిపూర్ గ్రామాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.

క్లుప్తంగా

రెండు ఇళ్లలో చోరీ

పటాన్‌చెరు టౌన్: తాళం వేసిన రెండు ఇండ్లలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ముక్కుంజామీ ఈ నెల 12వ తేదీన తాళం వేసి హైదరాబాద్‌లో ఉండే అత్తగారింటికి వెళ్లాడు. 14వ తేదీన స్థానికులు ముక్కుంజామీకి ఫోన్ చేసి మీ ఇంటి తాళం పగలగొట్టి ఉందని సమాచారం చేరవేశారు. దీంతో ఇంటికి వచ్చిన అతను లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, వెండి ఆభరణాలు పోయాయని గుర్తించాడు. ఈ విషయాన్ని పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు.

మరో సంఘటనలో

ముక్కుంజామీ ఇంటి ముందు నివాసం ఉండే శ్రీనివాస్ రావు ఇంట్లో కూడా దొంగలు పడి రెండు తులాల బంగారం, కొంత నగదు పోయినట్లు అతను ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్లాస్ డోర్ తొలగించి..

రామచంద్రాపురం (పటాన్ చెరు): వంటగది గ్లాస్ డోర్ తొలగించి గుర్తు తెలియని దుండగులు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం..రామచంద్రాపురం పట్టణంలోని శ్రీ సాయి నగర్ కాలనీలోని అపార్ట్‌మెంట్లో నివాసముండే ధీరజ్ కుమార్ ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఆ సమయంలో అతని తల్లిదండ్రులు ఇంట్లోనే ఉన్నారు. తిరిగి సోమవారం మధ్యాహ్నం ఇంటికొచ్చేసరికి వంట గది గ్లాస్ డోర్ తెరిచి ఉంది. దాన్ని గమనించిన ధీరజ్ కుమార్ అతని గదిలోకి వెళ్లి చూశాడు. మూడు గ్రాముల బంగారు ఆభరణాలు, ఆరు తులాల వెండి పట్టగొలుసు, కెమెరా చోరీ అయినట్లు గుర్తించాడు. వెంటనే సోమవారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోని ఊబచెరువులో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని సీఐ తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిస్తే సదాశివపేట సీఐ నవీన్‌కుమార్ 8712656721కు ఫోన్‌లో గానీ పోలీస్‌స్టేషన్‌లో గానీ సంప్రదించాలన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని పలు ప్రధాన చౌరస్తాల్లో ఆరు రోజుల క్రితం సిబ్బందితో డ్రంకెన్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 7 గురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.15వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నారాయణఖేడ్: నారాయణఖేడ్ పట్టణంతో పాటు మండలంలో పలుచోట్ల పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 25మంది పట్టుబడ్డారని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం నారాయణఖేడ్ జూనియర్ సివిల్‌జడ్జీ కోర్టులో వారిని హాజరు పర్చగా రూ.30వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.శ్రీధర్ తీర్పు ఇచ్చారన్నారు. మరోసారి మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపుతామని వారు హెచ్చరించారు.

చెట్టుకొకరు.. పుట్టకొకరు

- యంత్రాల శబ్దం తప్ప మనుషుల అలికిడి లేదు
- ఏళ్ల నాటి బంధాలు వీడలేక చెదిరిన దూరం
- ఊరు ఆనవాళ్లు లేకుండా నేల మట్టం
- నందారం క్రాస్ రోడ్డు వద్ద మరో గూడాటిపల్లెకు నామకరణం



ఇళ్ల కూల్చివేత తర్వాత ఇలా



పునాది రాళ్లను ట్రాక్టర్లో నింపుతున్న నిర్వాసితుడు



ఇళ్లను కూల్చి మట్టిని తవ్వుతున్న దృశ్యం

హుస్నాబాద్: ఎన్నో ఏండ్ల బంధాలు, అనుబంధాలు తొలగిపోయాయి. అరేయి..ఓరేయి అని పిలుచుకున్న పిలుపులు దూరమయ్యాయి. చెట్టుకొకరం..పుట్టకొకరుగా విడిపోయారు. ముంపు గ్రామంలో యంత్రాల శబ్దం తప్ప మనుషుల అలికిడి లేకుండా తయారైంది. ఇండ్లను యంత్రాలతో ధ్వంసం చేస్తూ ఊరును ఆనవాళ్లు లేకుండా చేశారు. ప్రాజెక్టు పేరు గౌరవెల్లి, ముంపునకు గురయ్యేది గుడాటిపల్లె. గౌరవెల్లి ప్రాజెక్టు కింద ముంపునకు గురైన గూడాటిపల్లెతో పాటు పలు తండాలు కనుమరుగయ్యాయి. భూ నిర్వాసితులు గూడాటిపల్లె గ్రామాన్ని ఖాళీ చేసి హుస్నాబాద్, పోతారం(ఎస్), గౌరవెల్లి, నందారాల వద్ద నివాసాలు ఏర్పరచుకుంటున్నారు. మరికొందరిని ఇటీవల పోలీసులు బలవంతంగా అర్ధరాత్రి ఖాళీ చేయించి హుస్నాబాద్ డబుల్ బెడ్రూం ఇండ్లకు తరలించారు. గూడాటిపల్లె గ్రామంలో 8.23 టీఎంసీల సామర్థ్యంతో గౌరవెల్లి ప్రాజెక్టును దాదాపు పూర్తి చేశారు. ఈ ప్రాజెక్టు కింద 3870 ఎకరాలు సేకరించారు. ఇందులో 48 ఎకరాలకు సంబంధించి ఎకరాకు రూ.30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కోర్టును ఆశ్రయించారు. 687 ఇండ్లు ముంపునకు గురవుతుండగా వారికి పరిహారం అందజేశారు. ముంపునకు గురవుతున్న 5 తండాల్లో సేవ్యానాయక్, బొంద్యనాయక్, జాలుబాయి, చింతల్, తిరుమల్ తండాలకు చెందిన 187 కుటుంబాలకు గాను ఒక్కొ కుటుంబానికి 250 గజాల చొప్పున నందారం స్టేజీ వద్ద ప్రభుత్వం ప్లాట్లను డెవలప్ చేసి ఇస్తుంది. ఇప్పటికే ట్రయల్ రన్ చేశారు. ఈ నెల చివరి వారంలో సీఎం కేసీఆర్ ఈ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ఏర్పాట్లను శరవేగంగా చేస్తున్నారు.

ఇళ్లు నేలమట్టం

గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా గూడాటిపల్లె గ్రామంలోని ఇళ్లను ధ్వంసం చేస్తున్నారు. గ్రామ ఆనవాళ్లు లేకుండా పెద్ద పెద్ద యంత్రాలతో ఇళ్లు నేలమట్టం చేస్తున్నారు. కట్టకు ఉన్న రెండు ప్రధాన రోడ్లను పూర్తిగా మూసివేశారు. కూల్చేసిన తమ ఇళ్లను చూసి కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. ప్రతి రోజు భూనిర్వాసితులు వచ్చి నేలమట్టమైన ఇళ్లను చూసి మా ఇల్లు ఇదేనని ఒకరికొకరు చెప్పుకుంటూ చలించిపోతున్నారు. వారు కూర్చున్న ఎత్తు గద్దెలు, వాకిలి, ఇంటి ముందు నీడనిచ్చిన వేప చెట్లు చూద్దామన్నా కనిపించకపోవడంతో కన్నీరుమున్నీరవుతూ బాధలను అణిచివేసుకుంటున్నారు. పాత ఇండ్ల నిర్మాణంలో ఉన్న పునాది రాళ్లను ట్రాక్టర్లలో తీసుకువెళుతున్నారు. పునాది రాళ్లు అవసరం లేనివారు ఒక్కో పునాది రాయిని రూ.10 చొప్పున అమ్ముకుంటున్నారు. ఇంటి దులాలు, దర్వాజలు, విద్యుత్ మోటర్లు, ఇలా విలువైన సామగ్రిని ట్రాక్టర్లలో తీసుకెళుతూ మరో చోట ఇండ్లు నిర్మించుకుంటున్నారు. గ్రామంలోని ఇండ్లను నేలమట్టం చేయడమే కాకుండా యంత్రాలతో మట్టిని తీస్తూ కట్టకు ఉపయోగిస్తున్నారు. మరో పది రోజుల్లో ఊరు క్రీడా మైదానంగా చేసేలా చదును చేస్తున్నారు.

యంత్రాల శబ్దమే తప్ప మనుషుల అలికిడి లేదు

గూడాటిపల్లె గ్రామంలో ఏటు చూసినా యంత్రాల శబ్దమే తప్ప మనుషుల అలికిడి లేదు. గ్రామ దేవతల విగ్రహాలు లేవు. కేవలం చిన్నపాటి హనుమాన్ దేవాలయం మాత్రమే కూల్చకుండా వదిలేశారు. గుడాటిపల్లె గ్రామం సర్కార్ జాబితాలో ఇంకా పేరును తొలగించకపోవడంతో ఇదే గ్రామం పేరిట నందారం స్టేజీ వద్ద ఊరును తయారు చేస్తున్నారు. అక్కడే ప్రభుత్వం గిరిజనులకు మోడల్ కాలనీ నిర్మిస్తుంది. అంతేకాకుండా దాదాపు 70 మంది నిర్వాసితులు ఇక్కడే ఇండ్లు నిర్మించుకునేందుకు ప్లాట్లు ఏర్పాటు చేసుకొని ఇండ్లను నిర్మిస్తున్నారు. ముంపునకు గురవుతున్న పాత గూడాటిపల్లెలోని హనుమాన్ విగ్రహాన్ని కొత్తగా తయారు చేస్తున్న గూడాటిపల్లె గ్రామంలో ప్రతిష్ఠించేందుకు పీఠాధిపతులతో నిర్వాసితులు సన్నహాలు చేస్తున్నారు.

బంధాలను తెంచుకొని గత్యంతరం లేక పోతున్నాం



ఎన్నో ఎండ్ల నుంచి కష్టం, సుఖం, సంతోషం, దుఃఖాన్ని అందరం కలిసి పంచుకున్నాం. ఏ ఆపద వచ్చినా పరస్పరం అండగా ఉండి పరిష్కరించుకున్నాం. అందరం సమిష్టిగా బాధలను పంచుకునే వాళ్లం. ఇప్పుడు చెట్టుకొకరం, పుట్టకొకరం విడిపోయాం. కన్న ఊరును విడిచి వెళ్లిపోతుంటే ఏదో కోల్పోయినట్లుగా జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి. ఊరును వదిలి బంధాలను తెంచుకొని గత్యంతరం లేక పోతున్నాం.

–బద్దం రాజిరెడ్డి, సర్పంచ్, గూడాటిపల్లె

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఒరిస్సా, కాలాహండి జిల్లాలోని రానామాల్ గ్రామానికి చెందిన లకోష్మంత నిమోలియా(35) నాలుగు రోజుల క్రితం బతుకుతెరువు కోసం అమీన్‌పూర్‌కొచ్చాడు. ఈ క్రమంలో సుల్తాన్‌పూర్ గ్రామ సమీపంలోని మెడికల్ డివైస్ పార్క్‌లో జరుగుతున్న కన్‌స్ట్రక్షన్ వద్ద కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి నడుచుకుంటూ రోడ్డుపైకి వెళ్లిన అతను తిరిగి రాలేదు. దీంతో వరుసకు సోదరుడైన సంజయ్ ఆచూకీకోసం వెతుక్కుంటూ వెళ్లగా అక్కడ గుమ్మికూడి ఉన్న జనాన్ని చూశాడు. అక్కడికెళ్లి చూసేసరికి లకోష్మంత నిమోలియా రోడ్డుపై టిప్పర్ ఢీకొని మృతిచెందాడని స్థానికుల ద్వారా తెలుసుకున్నాడు. డ్రైవర్ టిప్పర్‌ను అక్కడే వదిలేసి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోదరుడు సంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రాల నెపంతో మహిళపై దాడి

నిజాంపేట(మెదక్): మంత్రాల నెపంతో ఓ మహిళపై దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి..నిజాంపేట మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన ఇంబడి సత్తవ్వపై గత బుధవారం మంత్రాల చేస్తుందనే నెపంతో గ్రామానికి చెందిన తొమ్మిది మంది ఆమెపై దాడికి పాల్పడ్డారు. అనంతరం డీజిల్ పోసి చంపాలని చూశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆమెపై దాడి చేసిన తొమ్మిది మందిపై ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేసిన్నట్లు తెలిపారు.

ఒకరి లైసెన్సుతో ఇంకొకరు ఉద్యోగం



మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌గౌడ్

నర్సాపూర్: ఆర్టీసీలో ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా ఒకరి లైసెన్సుతో ఇంకొకరు ఉద్యోగం చేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌గౌడ్ సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద విలేకరులతో మాట్లాడారు. చండూరుకు చెందిన విష్ణు సుమారు ఆరు నెలల క్రితం తనకు ఫోన్ చేసి ఆర్టీసీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తన లైసెన్సును వాట్సాప్ ద్వారా పంపిచినట్లు చెప్పాడు. ఆ తర్వాత వ్యవసాయ పనుల్లో తను ఉద్యోగ విషయం మర్చిపోయానని చెప్పాడు. కాగా ఉద్యోగం ఇప్పిస్తానన్న విష్ణు తన లైసెన్సును ఫోర్జరీ చేసి అతని అల్లుడైన క్రిష్ణకు ఆర్టీసీలో ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా ఉద్యోగం ఇప్పించినట్లు తనకు ఇటీవల తెలిసిందన్నాడు. దీంతో అతన్ని గట్టిగా అడిగేసరికి సరైన సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నాడు. ఈ విషయంలో విష్ణు కూడా సరైన సమాధానం చెప్పలేదు. ఈ క్రమంలోనే ఉద్యోగం ఇప్పించకుండా తనను మోసం చేసినట్టుగా గుర్తించి సదరు వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో, నర్సాపూర్ ఆర్టీసీడిపోలో సైతం ఫిర్యాదు చేసినట్లు అనిల్‌కుమార్‌గౌడ్ వివరించారు.

బాధితుని ఫిర్యాదు

ఇన్‌చార్జ్ ఎస్ఐ వివరణ

ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానన్న విషయంపై అనిల్‌కుమార్‌గౌడ్ మోసపోయినట్టుగా ఫిర్యాదు అందిందని ఇన్‌చార్జ్ ఎస్ఐ జైపాల్‌రెడ్డి చెప్పారు.

తమ దృష్టికి వచ్చింది

ఫోర్జరీ లైసెన్సుతో ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా క్రిష్ణ ఉద్యోగం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని స్థానిక ఆర్టీసీడిపో సూపరింటెండెంట్ లక్ష్మణ్ చెప్పారు. ఈ మేరకు అనిల్‌కుమార్ గౌడ్ తనకు ఫిర్యాదు చేశాడని ఆయన పేర్కొన్నారు. ఫోర్జరీ చేసినట్లు తేలితే శాఖ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

గుర్తు తెలియని జంతువు దాడిలో గేదె మృతి

వెల్దుర్తి(తూప్రాన్): గుర్తు తెలియని జంతువు దాడిలో గేదె మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని శంశిరెడ్డిపల్లితండాకు చెందిన కాట్రోత్ శంకర్ తన గేదెలను రోజూమాదిరిగా గ్రామ శివారులోని పంటపొలాల్లో మేతకు తీసుకెళ్లాడు. మేత మేసిన అనంతరం తన పొలం వద్ద ఓ చెట్టుకు కట్టేసి ఇంటికి వచ్చేవాడు. సుమారు రాత్రి 10 గంటల ప్రాంతంలో గేదెల అరుపులు వినిపించాయి. దీంతో ఆందోళన చెంది అక్కడికి పరుగులు తీయగా అప్పటికే ఒక గేదె మృతి చెంది ఉంది. గేదె మెడ భాగంలో మృగజంతువు దాడి చేసినట్లు పెద్ద గాయం కనిపించింది. దీంతో పులి దాడి చేసి ఉండోచ్చని భావిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు భయటకు రావాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు.

రైలు దిగే క్రమంలో గాయపడి మహిళ మృతి

జహీరాబాద్: రైలు దిగే క్రమంలో గాయపడి మహిళ మృతి చెందిన సంఘటన జహీరాబాద్ రైల్వే స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే స్టేషన్ హౌస్ ఆఫీసర్ మల్లేశ్ కథనం ప్రకారం.. శహీనాబేగం(35) వరంగల్ నుంచి తన తల్లి గారి ఇంటికి న్యాల్కల్ గ్రామానికి వెళ్లేందుకు బీదర్ రైలు ఎక్కింది. సోమవారం జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు దిగింది. ప్రమాదవశాత్తు కింద పడి ప్లాట్ ఫాం రైలు మధ్యలో చిక్కుకుంది. ఈ క్రమంలోనే అప్పుడే రైలు కదలడంతో రెండు కాళ్లు, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. వికారాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

వక్ఫ్‌బోర్డు భూములు కాపాడాలి

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణంలోని పోచమ్మ ఆలయ సమీపంలోని వక్ఫ్‌బోర్డు భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని మజీద్ కమిటీ అధ్యక్షుడు ఖలీల్ అన్నారు. సోమవారం జామా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సర్వే నెంబర్లు 1321, 1322లో ఉన్న భూములను కబ్జాదారులనుంచి కాపాడాలని కోరుతు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.



వినతిపత్రం ఇస్తున్న మజీద్ కమిటీ నాయకులు

చికిత్స పొందుతున్న సాధువు మృతి



గుర్తుతెలియని సాధువు మృతదేహం

ఝరాసంగం(జహీరాబాద్): చికిత్స పొందుతున్న గుర్తుతెలియని సాధువు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని బర్దిపూర్ దత్తగిరి మారాజ్ ఆశ్రమానికి సాధువులు వచ్చి వెళ్తుంటారు. ఈ నెల 5న సుమారు 70సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని సాధువు ఆశ్రమానికి వచ్చి స్పృహ లేకుండా పడి ఉన్నాడు. దీన్ని గమనించిన ఆశ్రమ నిర్వాహకులు చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆదివారం అర్ధరాత్రి అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరచినట్లు పేర్కొన్నారు. ఆశ్రమ ఇన్‌చార్జి కోట వెంకటేశం ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేందర్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగానే ఖలీల్ పరిస్థితి

జోగిపేట(అందోల్): జోగిపేట పోలీస్ స్టేషన్ ముందు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఖలీల్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి ప్రమాదకరంగానే ఉన్నట్లు జోగిపేట ఎస్ఐ సామ్యానాయక్ తెలిపారు.

మొబైల్ ఫోన్ దొంగిలించిన వ్యక్తి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు

సదాశివపేట(సంగారెడ్డి): బస్టాండ్‌లో ఫోన్‌లో మాట్లాడుతుండగా మొబైల్ ఫోన్‌ను లాక్కుని వెళ్లిన నిందితుణ్ని అరెస్ట్ చేసినట్టు సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. పస్తాపూర్ గ్రామానికి చెందిన అవుసలి పద్మజ ఈ నెల 10న సదాశివపేట పట్టణంలోని బంధువుల ఇంటికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు సదాశివపేట బస్టాండ్‌లో ఫోన్‌లో మాట్లాడుతుంది. కాగా బుదేరా గ్రామానికి చెందిన వడ్ల సాయిచారి ఫోన్ లాక్కొని పారిపోయడన్నారు. సోమవారం నిందితుడిని పట్టుకుని విచారించగా నేరం అంగీకరించాడు. దీంతో అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామని సీఐ తెలిపారు.

రెండు బైక్‌లు చోరీ

తూప్రాన్: పట్టణంలో వేర్వేరు చోట్ల సోమవారం రెండు బైక్‌లు చోరీకి గురయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శివసాయి గార్డెన్‌లో దినేశ్ అనే యువకుడు తన బైక్‌ను నిలిపి లోపలికి వెళ్లి వచ్చే సరికి తన ఎఫ్‌జెడ్ బైక్ కనిపించలేదు. ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోం పక్కన నివాసం ఉంటున్న శంకర్ తన ఇంటి ముందు నిలిపిన బైక్ కనిపించకుండా పోయింది. దీంతో పోలీసుల పెట్రోలింగ్, గట్టి నిఘా లేకపోవడం వల్లే దొంగలు రెచ్చిపోతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యం

దుబ్బాకలో



రమేశ్

దుబ్బాక: యువకుడు అదృశ్యమైన సంఘటన రాయపోల్‌లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రానికి చెందిన కుమ్మరి ఆగంకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో ద్వితీయ పుత్రుడు కుమ్మరి రమేశ్ (21) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగానే ఉద్యోగానికి వెళ్లాడు. విధులు ముగించుకుని ఇంటికి రాకపోవడంతో రమేశ్‌కు తల్లిదండ్రులు ఫోన్ చేయగా డ్యూటీలో ఉన్నానని బదులు చెప్పాడు. ఆదివారం కూడా ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అయ్యింది. అప్పటి నుంచి తెలిసిన వారి వద్ద, స్నేహితులు, బంధువుల వద్ద ఆచూకీ కోసం గాలించగా ఫలితం లేదు. దీంతో కుటుంబీకులు సోమవారం రాయపోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ షేక్ మహబూబ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పసల్వాది తండాలో..



కేతావత్ బుజ్జి

సంగారెడ్డి టౌన్: మహిళ అదృశ్యమైన సంఘటన సంగారెడ్డి మండలంలోని పసల్వాది తండాలో సోమవారం చోటుచేసుకుంది. సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కెతావత్ బుజ్జి(42) బయటికి వెళ్లొస్తానని చెప్పి ఎంతసేపటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 8712656746, 8712656719 నెంబర్లకు సంప్రదించాలని రూరల్ పోలీసులు తెలిపారు.

కిరాణ షాపునకు వెళ్తానని



సాయికుమార్ (ఫైల్)

చేగుంట(తూప్రాన్): కిరాణ షాపునకు వెళ్తున్నట్లు ఇంట్లోంచి వెళ్లిన బాలుడు తిరిగి రాలేదు. ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేటకు చెందిన పోతిన్‌పల్లి యాదమ్మ చిన్న కుమారుడు సాయికుమార్ తూప్రాన్ బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుకుంటున్నాడు. వేసవి సెలవులకు ఇంటికొచ్చిన సాయికుమార్ ఆదివారం సాయంత్రం కిరాణ దుకాణానికి వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లోంచి వెళ్లి రాత్రయినా ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సాయికుమార్ ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇద్దరి ఆత్మహత్య

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. ఆర్థిక ఇబ్బందులతో ఒకరు, జీవితంపై విరక్తితో ఇంకొకరు మృతి చెందారు.

ఆర్థిక ఇబ్బందులతో..



సిద్ధాల బాలయ్య (ఫైల్)

గజ్వేల్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రిమ్మనగూడలో చోటు చేసుకుంది. సోమవారం గజ్వేల్ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..రిమ్మనగూడకు చెందిన సిద్ధాల బాలయ్య(45)గత కొంతకాలంగా కుటుంబ సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఉరివేసుకున్నాడు.

జీవితంపై విరక్తితో..

జహీరాబాద్: కోహీర్ మండలపరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సురేశ్(27)జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ రైల్వే స్టేషన్ హౌస్ ఆఫీసర్ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం..సురేశ్ భార్య నాలుగు సంవత్సరాల క్రితం తల్లిగారింటికి వెళ్లింది. అప్పటి నుంచి కాపురానికి రాక పోవడంతో జీవితంపై విరక్తి చెందిన అతడు జహీరాబాద్ కోహీర్ రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వికారాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘ఉగ్ర సీన్’ రీ-కన్‌స్ట్రక్షన్!

- ఆ ఆరుగురిని సిటీకి తీసుకొచ్చిన ఏటీఎస్
- నగరంలోని పలు ప్రాంతాల్లో వీరి ‘పర్యటన’
- నేడు సిద్దిపేట శివారుకు తీసుకువెళ్లే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులకు హైదరాబాద్‌లో చిక్కిన ఐదుగురు ఉగ్రవాదులు దర్యాప్తును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారా..? ఔననే అంటున్నారు అధికారులు. ప్రాథమిక విచారణలో వీళ్లు చెప్పిన విషయాలను సీన్ రీ-కన్‌స్ట్రక్షన్‌లో గుర్తించిన అంశాలకు పొంతన లేదని స్పష్టం చేస్తున్నారు. తాజాగా చేపట్టిన క్షేత్రస్థాయి విచారణలో అనేక కీలకాంశాలు గుర్తించారు. గత వారం సిటీలో అరెస్టు అయిన ఐదుగురితో పాటు భోపాల్‌లో చిక్కిన సూత్రధారి యాసిర్ ఖాన్‌ను ఏటీఎస్ అధికారులు సోమవారం హైదరాబాద్ తీసుకువచ్చారు. వీరిని నగరంలోని అనేక ప్రాంతాలకు తీసుకువెళ్లి సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ చేశారు. మంగళవారం సిద్దిపేట శివారులో ఈ ప్రక్రియ పూర్తి చేసి తిరిగి భోపాల్ తరలించనున్నారు. మధ్యప్రదేశ్ ఏటీఎస్ అధికారులు గత వారం సిటీలో అరెస్టు చేసిన మహ్మద్ సలీం, అబ్దుల్ రెహ్మాన్, మహ్మద్ అబ్బాస్ అలీ, షేక్ జునైద్, మహ్మద్ హమీద్‌లతో పాటు భోపాల్‌లో చిక్కిన యాసిర్ ఖాన్‌లను సోమవారం సిటీకి తీసుకువచ్చారు. ఈ ఉగ్రవాదులంతా సలీం, రెహ్మాన్, సల్మాన్ (ప్రస్తుతం పరారీలో ఉన్నాడు) ఇళ్లల్లో సమావేశాలు నిర్వహించారు. వీటిలో సలీం ఇంట్లో జరిగిన ప్రతి సమావేశాలకీ యాసిర్ హాజరయ్యాడు. ఈ నేపథ్యంలోనే ఏటీఎస్ అధికారులు ఈ ఆరుగురిని సమావేశాలు జరిగిన ఇళ్లకు, ఐదుగురినీ వారి వారి ఇళ్లకు తీసుకువెళ్లి పలు అంశాలను రికార్డు చేశారు. తన మాడ్యుల్ ప్రాక్టీస్ చేయడానికి సలీం ఎంజే మార్కెట్ సమీపంలోని ఓ ఆయుధాల విక్రయ దుకాణం నుంచి మూడు ఎయిర్ పిస్టల్స్, పిల్లెట్స్ ఖరీదు చేశారు. అతడికి ఆ షాపు వద్దకు తీసుకువెళ్లిన ఏటీఎస్ అధికారులు దానికి సంబంధించిన రికార్డులు స్వాధీనం చేసుకోవడంతో పాటు యజమాని వాంగ్మూలం నమోదు చేశారు. ఈ ఉగ్రవాదులు అరెస్టు అయిన సమయంలో తాము నగర శివార్లలోని అనంతగిరి అడవుల్లో ఎయిర్ పిస్టల్స్‌తో ఫైరింగ్ ప్రాక్టీస్ చేసినట్లు పోలీసులకు చెప్పారు. వీరిని లోతుగా విచారించిన నేపథ్యంలో ఏటీఎస్ అధికారులు దర్యాప్తును తప్పుదోవ పట్టించడానికే ఇలా చెప్పారని గుర్తించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారంతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి వీళ్లు ఫైరింగ్ ప్రాక్టీస్‌కు ఏ అడవుల్లోకీ వెళ్లలేదని, టోలిచౌకిలో ఉన్న ప్రైవేట్ షూటింగ్ అకాడెమీలో చేసినట్లు గుర్తించారు. అక్కడకు వెళ్లిన ఏటీఎస్ టీమ్ రికార్డులు స్వాధీనం చేసుకుని, స్టేట్‌మెంట్స్ రికార్డు చేసింది. పరారీలో ఉన్న సల్మాన్ సహా నగరంలో అరెస్టు అయిన ఆరుగురూ తరచు సిద్దిపేటకు వెళ్లి వచ్చినట్లు తేలింది. అక్కడకు ఎందుకు వెళ్లారనే కోణంలోనూ ఉగ్రవాదులను ఏటీఎస్ అధికారులు విచారించారు. ఆ పట్టణానికి శివార్లలోని నిర్మానుష్య ప్రాంతంలో ఓ ప్రార్థన స్థలం ఉందని, అక్కడా తాము కొన్ని సమావేశాలు నిర్వహించామని బయటపెట్టారు. కత్తులు, గొడ్డళ్లు వినియోగించి దాడి చేయడం, విల్లులతో బాణాలు వేయడంతో పాటు ఫిట్‌నెస్‌కు సంబంధించిన కొన్ని ట్రెనింగ్స్ అక్కడ చేసినట్లు అంగీకరించారు. దీంతో ఈ ఉగ్రవాదులను మంగళవారం సిద్దిపేట శివార్లకు తీసుకువెళ్లాలని ఏటీఎస్ అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్ మాడ్యుల్‌లో కీలకంగా వ్యవహరించిన సలీం, రెహ్మాన్ గతంలో మరికొందరినీ ఉగ్రవాదం వైపు ఆకర్షించాలని ప్రయత్నించారు. తాము కేవలం మతపరమైన కార్యక్రమాలు చేపడుతున్నామని నమ్మబలికి వారిని తమ ఇళ్లల్లో జరిగిన సమావేశాలకు రప్పించారు. అయితే వాటిలో ఈ ద్వయం చెప్తున్న అంశాలు రెచ్చగొట్టే విగా, వీరి కార్యకలాపాలు అనుమానాస్పదంగా భావించిన వారంతా దూరమయ్యారు. ఈ కేసులో అలా దూరమైన వారిని సాక్షులుగా మార్చాలని ఏటీఎస్ నిర్ణయించింది. న్యాయస్థానంలో నిందితులను దోషులుగా నిరూపించడానికి ఇవి కీలకమనే ఉద్దేశంతో రాష్ట్ర నిఘా వర్గాలతో కలిసి వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తోంది. సోమవారం వరకు చంద్రాయణగుట్ట, హఫీజ్ బాబానగర్ ప్రాంతాలకు చెందిన ఇద్దరిని గుర్తించారు. నగరంలో ఉన్న ఏటీఎస్ టీమ్ వీరి నుంచీ వాంగ్మూలాలు నమోదు చేసింది. ఈ ఉగ్రవాదుల ఏటీఎస్ కస్టడీ గడువు శుక్రవారంతో ముగియనుంది.